సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం : 13 : జూలై : 2025



భర్తను హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించి..
భర్తను రెండవ భార్య చంపి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసులు దర్యాప్తులో ఈ విషయాన్ని తేల్చారు. - 8లో



బాలిక అదృశ్యం కేసులో నిందితుడి అరెస్టు
వేంపల్లె పంచాయతీ పక్కీరుపల్లెకు చెందిన బాలిక అదృశ్యం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.6 /28.5
జిల్లాలో శనివారం 28.5- 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 26.76 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మాజీ సైనిక సంక్షేమ సంఘం సమావేశం

కడప అర్బన్ : కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల మాజీ సైనిక సంక్షేమ ఉద్యోగుల సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు దాసరి రమణయ్య, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఎస్.ఎస్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమ సంఘం నేతలు, మాజీ సైనిక ఉద్యోగులు తమ సంక్షేమం, ఇళ్ల స్థలాల కోసం పత్రాలు తీసుకుని రావాలని వారు పేర్కొన్నారు. భూ, స్థలాల సమస్యలపై చర్చించడం జరుగుతుందని వివరించారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శులుగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందులకు చెందిన వడ్డెరపు గంగాధర్ యాదవ్, రాయచోటికి చెందిన రమేష్ అంపాబత్తినలను నియమించారు. అలాగే అన్నమయ్య జిల్లా పీలేరు మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా అంబవరం మల్లికార్జునరెడ్డిని నియమించారు.

నేటి నుంచి ఏసీఏ మల్టీ డే మ్యాచ్‌లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడపలో ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు ఏసీఏ సౌత్‌జోన్ అండర్-16 మెన్ మల్టీ డే మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జట్లు పాల్గొంటున్నాయి. కేఎఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

మూఢ నమ్మకాల తొలగింపే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : సమాజంలో మూఢ నమ్మకాలను తొలగించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని యస్.వి.ఇంజినీరింగ్ కాలేజీలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకం, జన విజ్ఞాన వేదిక పతాకాల ఆవిష్కరణతోపాటు గీతాలాపనతో ప్రారంభించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జేవీవీ ప్రజల ఆరోగ్యం, విద్యకు సంబంధించి ప్రధానంగా కృషి చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయడం, అన్ని రంగాల్లో సంతులిత అభివృద్ధిని సాధించే విధంగా ఉత్సాహపరచడంలో జేవీవీ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డియోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ పుత్తా పద్మజ కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె.రాకేష్ చంద్ర, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జాతీయ నాయకులు బి.విశ్వనాథ, కృష్ణాజీ, శ్రీనివాసులు, సనావుల్లా, మహమ్మద్ మియా, యస్.స్వరాజ్యలక్ష్మి, వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఈ రాష్ట్ర మహాసభలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జేవీవీ ప్రతినిధులు హాజరయ్యారు.

చిగురిస్తున్న ఆశలు

అన్నదాతలు వానకాలం వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఎగువ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు కృష్ణానది పరవళ్లు తొక్కుతుండడంతో.. కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. జూరాల, ఆల్మట్టి నుంచి వరద నీరు వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు రావడంతో వానకాలం ముందే వచ్చిందని రైతులు ఆశపడ్డారు. కానీ జూన్ నెల మొత్తం వర్షాలు లేకపోవడంతో వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేసే అవకాశాలు కనిపిస్తుండటంతో.. రైతుల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

- నిండిన శ్రీశైలం ప్రాజెక్టు
- త్వరలో కేసీ కాలువకు నీటి విడుదల
- జిల్లాలో 92,937 ఎకరాల కేసీ ఆయకట్టు
- ఊపందుకోనున్న సాగు
- అన్నదాతల్లో ఆనందం



చెన్నూరు సమీపంలో ట్రాక్టర్‌తో సాగుకు దమ్ము చేస్తున్న రైతన్న



కడప అగ్రికల్చర్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టు నిండు కుండలా పరవళ్లు తొక్కుతోంది. కేసీ అధికారులు త్వరలో కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా కేసీ కెనాల్ కింద 92,937.01 ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను అధికారులు పంపిణీ చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిండటంతో కేసీ కెనాల్‌కు నీరు విడుదల కానున్న నేపథ్యంలో.. నారుమడుల సాగు జోరందుకోనుంది. రైతన్నలు ఇప్పటికే మండల కేంద్రాలకు వెళ్లి విత్తనవడ్లు తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. నది పరీవాహక ప్రాంతాల్లోని రైతులు తెచ్చుకున్న విత్తనపు వడ్లను నానబెట్టి మండెకట్టి నారుమడులు సాగు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నారు. నారుమడుల సాగుకు సంబంధించి చిన్ని చిన్న కయ్యలను ఏర్పాటు చేసుకుని, అందులో దమ్ము చేసుకుంటూ హడావిడిగా ఉన్నారు. నీటి ఆధారం ఉన్న కొందరు రైతులు ఇప్పటికే నారుమడులను సాగు చేసుకున్నారు. నీటి ఆధారం లేని వారు కేసీకి నీరు విడుదల కాగానే నారుమడులను సిద్ధం చేసుకుంటారు. ముందుగా నారుమడులు సిద్ధం చేసుకున్న రైతన్నలు కేసీ కాలువకు నీరు రాగానే వరినాట్లు ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,93,722 ఎకరాల్లో సాధారణ పంటల సాగు లక్ష్యం కాగా.. ఇందులో 80 వేల ఎకరాల్లో వరి పంట సాగు కానుంది.

సత్తువ పంటలుగా జనుము, జీలుగల సాగు

నీటి ఆధారం ఉన్న రైతాంగం వరి సాగుకు ముందుగా.. భూమికి సత్తువ కోసం జీలుగలు, జనుములను చల్లుకుని దమ్ముకు సిద్ధం చేసుకుంటున్నారు. నారుమడి సిద్ధమై వరినాట్లు వేసుకునేందుకు నెల రోజులకు పైగా గడువు ఉండటంతో.. ఆలోపు జీలుగలు, జనుము బాగా పెరిగి భూమికి సత్తువగా పనికొస్తుంది. నీటి ఆధారం లేని రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు సాగు చేసుకున్నారు. మరి కొంత మందికేసీకి నీరు రాగానే జీలుగలు, జనుములు సాగు చేస్తారు. వీరు నారుమడులు సాగు చేసి.. అది సాగుకు సిద్ధమయ్యే సమయానికి ఈ జీలుగ, జనుము పంట కూడా దమ్ముకు సిద్ధమవుతుంది. దీంతో ఈ జీలుగ, జనుము పంట భూమికి సత్తువగా పనికొస్తుంది.

జిల్లాలో వరినాట్లు ప్రారంభం

నది పరీవాహక, నీటి ఆధారం ఉన్న రైతులు ముందుగా నారుమడులు ఏర్పాటు చేసుకుని వరిసాగు పనులు ఆరంభించారు. ఇప్పటికే జిల్లాలో నది పరీవాహక ప్రాంతాలైన చెన్నూరు, కడప, కమలాపురం, సిద్ధవటం, వల్లూరు, చెన్నూరు, చక్రాయపేట, జమ్మలమడుగు తదితర మండలాల పరిధిలో వెయ్యి ఎకరాల వరకు వరి పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

కేసీ కెనాల్ కింద సాగులో ఉన్న ఆయకట్టు వివరాలు

మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)
దువ్వూరు	10,419.28
చాపాడు	20,894.48
మైదుకూరు	3,553.23
ఖాజీపేట	20,804.82
రాజుపాళెం	6,894.24
ప్రొద్దుటూరు	5,427.50
కడప	5,371.83
చెన్నూరు	8,200.34
వల్లూరు	406.88
చింతకొమ్మదిన్నె	121.12
పెద్దముడియం	9,063.0
చాగలమర్రి	643.29
మొత్తం కేసీ ఆయకట్టు	92,937.01

ప్రతి రైతు పాటించాలి



నారుమడులు సాగు చేసుకునే రైతులు పైన తెలిపిన అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. ఇందులో నిర్లక్ష్యం చేస్తే సాగు తరువాత వరి పంటలకు చీడపీడలను ఆశించి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ముందుగా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వరిపంట సాగు తరువాత ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
- డాక్టర్ వీరయ్య, కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వైఎస్సార్ జిల్లా.

నారుమడుల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నారుమడిని సాగు చేయాలనుకునే రైతులు 10-12 రోజుల వ్యవధిలో భూమిని 3 దఫాలు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- శిలీంద్ర నాశినితో శుద్ధి చేసి మొలకకట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- 5 సెంట్ల నారు మడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లే ముందు 1 కిలో, మరో కిలో విత్తనం వేసిన 10-15 రోజులకు), 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి.
- నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు ఇచ్చి, తర్వాత పలుచగా నీరు నిల్వకట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- నారుమడి సాగు చేసిన 10 రోజులకు కార్బొఫ్యూరాన్ 3జి గుళికలు 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదంటే మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లేక క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీలీటర్లను లీటర్ నీటికి కలిపి సాగు చేసిన 10 రోజులకు, అలాగే 17 రోజులకు పిచికారి చేయాలి.
- మండె కట్టిన తర్వాత ముక్కు పగిలిన విత్తనాలను నారుమడిలో సమానంగా పలుచటి నీటి పొర ఉంచి విత్తకోవాలి. మరుసటి రోజు నారు మడిలో నీటిని మొత్తం తీసివేయాలి.



పాతకడప సమీపంలో ఇటీవలే సాగు చేసిన వరి పంట



ములపాకు సమీపంలో సాగు చేసిన నారుమడి

పక్కీర్‌పల్లె.. ఖాళీ

- పోలీసుల కేసుకు భయపడి ఊరు వదిలి వెళ్లిన గ్రామస్తులు
- ఎక్కడ చూసినా ఇళ్లకు తాళాలే
- నిర్మానుష్యంగా మారిన గ్రామం



పక్కీర్‌పల్లెలో నిర్మానుష్యంగా మారిన వీధులు



ఇంటి గేటుకు వేసిన తాళం

వేంపల్లె : వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న పక్కీర్‌పల్లె ఖాళీ అయింది. పోలీస్‌స్టేషన్ ముట్టడి సంఘటనలో పోలీసులు పెట్టే కేసులకు భయపడి.. గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. గ్రామంలో జనాలు లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. ఎక్కడ చూసినా ఇళ్లకు తాళాలు వేసిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఊర్లో ఉన్న మగ, ఆడ, పిల్లలు ఇలా అందరూ వెళ్లిపోయారు. కొందరు ఆడవాళ్లు, చిన్నపిల్లలు, వృద్ధులు వీధుల్లో అక్కడక్కడ కనిపిస్తున్నారే తప్ప, జనాలు ఎక్కువ మంది లేరు. వివరాలలోకి వెళితే.. పక్కీర్‌పల్లెలో ఈ నెల 7వ తేదీన గొర్రెలు మేపేందుకు సమీపంలోని కొండల్లోకి 17 ఏళ్ల అమ్మాయి వెళ్లింది. ఆమె అదృశ్యం కావడంతో బంధువులు గ్రామస్తులను పిలుచుకుని వేంపల్లె పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన మడకబాబు అనే యువకుని సెల్‌ఫోన్‌లో అమ్మాయి బట్టలు చిరిగిపోయి, దండం పెట్టే వీడియో ఉండటంతో వారి ఆగ్రహం మరింత కట్టలు తెంచుకుంది. అమ్మాయిని రేప్ చేసి చంపేశారేమోనన్న అనుమానంతో పోలీస్ స్టేషన్ వద్ద రచ్చ చేశారు. దీంతో అమ్మాయి బంధువులు, గ్రామస్తులపై పోలీసులు హత్యాయత్న కేసు నమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌పై దాడికి దిగారని కేసు నమోదు

అయితే అదే రోజు రాత్రి దాదాపు 10 గంటల ప్రాంతంలో అమ్మాయి.. పోలీస్ స్టేషన్‌లో ఉన్న తండ్రికి ఫోన్ చేసి తాను గొర్రెల దొడ్డి వద్ద ఉన్నానని చెప్పింది. దీంతో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ నేతృత్వంలో పోలీస్ బృందాలు హుటాహుటిన అమ్మాయి ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అమ్మాయిని సురక్షితంగా కడప రిమ్స్‌కు తరలించారు. అమ్మాయి దొరికింది అనే విషయం చెప్పినా కూడా కొంత మంది ఆందోళనకారులు వారి ఆందోళన విరమించలేదు. అప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఉన్న కిటికీ అద్దాలు కుర్చీలు, వాకిళ్లను పగులగొట్టారు. ఆ సమయంలో పోలీస్ స్టేషన్ సెంట్రీ డ్యూటీలో ఉన్న రామాంజనేయులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారని కేసు నమోదు చేశారు. కొంత మందిని ఇప్పటికే అరెస్టు చేయగా, మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పక్కీర్ పల్లెకు చెందిన బాలికకు, చింతలమడుగుపల్లెకు చెందిన మడక బాబుకు చనువైన పరిచయం ఉన్నట్లు తెలిసింది. వారిద్దరూ మధ్యాహ్న సమయంలో వజ్రాల కోన దగ్గర ఉన్నట్లు అక్కడున్న స్థానిక ప్రజలు చెప్పడంతో.. అమ్మాయి తల్లిదండ్రులు మరి కొంత మందితో కలిసి గుట్టలో వెతకగా మడక బాబు కనిపించాడు. అమ్మాయి బంధువులు మడక బాబుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 7వ తేదీ సాయంత్రం పోలీస్‌స్టేషన్ వద్దకు పిలుచుకుని వచ్చినట్లు కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

60 మందిని అదుపులోకి..

అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో కొంతమంది మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చి మడక బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. మడక బాబును విచారణ చేస్తున్నామని పోలీసులు ఎంత చెప్పినా.. వినకుండా పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ దాడి చేశారు. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి అరెస్టులు చేస్తున్నారు. దీంతో కేసుకు సంబంధించి ఇప్పటికి 60 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన ఆందోళనకారులను అరెస్టు చేయాలని పోలీసులు వీధి, వీధి గాలింపు చర్యలు చేపట్టడంతో.. పక్కీర్ పల్లెలోని అందరినీ అరెస్టు చేస్తారన్న భయంతో గ్రామస్తులు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

మాకేం తెలియదని మహిళల ఆందోళన

గ్రామంలోని మహిళలు మాత్రం తమకు గానీ, తమ గ్రామానికి చెందిన ప్రజలకు ఏమీ తెలియదని, బాలికను రేప్ చేసి చంపేశారని గ్రామంలో ఉన్న ఇంటింటికి తిరిగి అమ్మాయి తల్లిదండ్రులు చెప్పడంతోనే వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లామని చెప్పుకొచ్చారు. తామంతా కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వారిమని, ఇప్పుడు ఈ కేసు వల్ల తమకు తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయని మహిళలు వాపోతున్నారు.

దిగజారి ప్రవర్తిస్తున్నారు..



కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడిని ఖండిస్తున్నా. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతుంది. కూటమి అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ కరువైంది. టీడీపీ, జనసేన పార్టీలు దిగజారి ప్రవర్తిస్తున్నాయి. జిల్లా ప్రథమ మహిళకే ఈ పరిస్థితి వస్తే, సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడి నుంచి లభిస్తుంది. పోలీసుల సమక్షంలో జెడ్పీ చైర్‌పర్సన్‌పై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. చేతగాని మనుషుల్లా పోలీసులు ఎందుకు నిలబడ్డారో అర్థం కావడం లేదు. మానవ ప్రపంచం సిగ్గుతో తల వంచుకోవాల్సిన పరిస్థితి.
- పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ, జిల్లా అధ్యక్షులు

తాళ్లపాకను సందర్శించిన టీటీడీ అధికారులు

తాళ్లపాక(రాజంపేట) : అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకను టీటీడీ అధికారులు శనివారం సందర్శించారు. అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందించడానికి ముందుగా టీటీడీ అధికారులు విలేజ్ విజిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇంజినీరింగ్ ఎస్ఈ మనోహర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాగరాజు, నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

రమణీయం..రథోత్సవం

- వైభవంగా సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామిని రథంపై కొలువుదీర్చి ముందుకు కదిలించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. గోవింద నామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. శనివారం రాత్రి అశ్వవాహనంపై సౌమ్యనాథ స్వామి పురవీధుల్లో విహరించారు. భక్తులు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు రీజెన్సీ నలంద విద్యాసంస్థల అధినేత జీఎస్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సౌమ్యనాథ సేవ ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ఎద్దుల విజయసాగర్, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, రీజెన్సీ నలంద స్కూల్ వైస్ ప్రిన్సిపల్ దశరథరామయ్య, ప్రిన్సిపల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

బైకును ఢీకొన్న టిప్పర్



సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన బాలనాగయ్య, హుస్సేనయ్య

దువ్వూరు : కడప–కర్నూలు జాతీయ రహదారిపై పుల్లారెడ్డిపేట హైవే డాబా వద్ద బైకును టిప్పర్ ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన నల్లమ్మగారి బాలనాగయ్య, ఆయన వియ్యంకుడు మద్దూరు హుస్సేనయ్య కలిసి తన మేకపోతును మైదుకూరు సంతలో విక్రయించడానికి బైకుపై వెళుతున్నారు. వారు మండలంలోని పుల్లారెడ్డిపేట హైవే డాబా వద్దకు రాగానే గ్రావెల్ కోసం రాంగ్ రూట్‌లో వెళుతున్న టిప్పర్ బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బాలనాగయ్య, హుస్సేనయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతుతున్న బాలనాగయ్య(43) మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

భర్తను హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించి..

- మొదటి భార్య ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- తలకు బలమైన గాయం కారణంగానే మృతి చెందినట్లు పోస్టుమార్టంలో వెల్లడి
- రెండో భార్య అరెస్టుతో ఆత్మహత్య డ్రామా గుట్టురట్టు



హత్య కేసులో నిందితురాలు సునీత అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్

ఖాజీపేట : భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ భర్త హత్యకు దారితీసింది.. అయితే తన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడంటూ అతని రెండవ భార్య అందరిని నమ్మించింది. భర్త మృతి విషయం తెలుసుకున్న మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారించారు. ఇది ఆత్మహత్య కాదు, రెండవ భార్య చేసిన హత్య అని పోలీసులు నిర్ధారించి రెండో భార్యను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా..

ఖాజీపేట మండలం అప్పనపల్లె గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాసులు యాదవ్ (50)కు 30 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరుకు చెందిన నక్కా లక్ష్మిదేవితో వివాహమైంది. భార్యతో గొడవల కారణంగా ఆమెకు తెలియకుండా చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన నక్కా సునీత (35)ను 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో మొదటి భార్యతో విడాకులు తీసుకున్నానని తప్పుడు ధ్రువ పత్రాలను చూపించాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య లక్ష్మిదేవి తనకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్న శ్రీనివాసులు యాదవ్‌పై కేసు పెట్టింది. కోర్టులో ఈ కేసు నడుస్తోంది.

మొదటి భార్య ఫిర్యాదుతో వాస్తవాలు వెలుగులోకి..

శ్రీనివాసులు యాదవ్ జూన్ 11వ తేదీన మృతి చెందాడు. తన భర్త మృతిపై తనకు అనేక అనుమానాలు ఉన్నాయంటూ మొదటి భార్య లక్ష్మిదేవి జులై 1వ తేదీన ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు ఖాజీపేట సీఐ మోహన్ కేసు నమోదు చేశారు. జులై 2న శ్రీనివాసులు యాదవ్ మృతదేహాన్ని రిమ్స్ డాక్టర్లు, తహసీల్దార్ సమక్షంలో వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన వ్యక్తి తల వెనుక భాగంలో బలమైన గాయం ఉందని ఈ గాయం కారణంగా చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు నివేదిక ఇచ్చారు. దీంతో పోలీసులు అప్పనపల్లె గ్రామంలో లోతైన విచారణ జరిపారు.

భర్త అసభ్యకరమైన ప్రవర్తన కారణంగానే హత్య..

మృతుడు శ్రీనివాసులు యాదవ్ మద్యం మత్తులో పిల్లల ఎదుటే భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడని పోలీసులు గుర్తించారు. దీంతో రెండవ భార్య విసుగు చెందేది. జూన్ 11న ఇద్దరు పిల్లలు బయట ఉండగానే ఇంట్లోకి తాగి వచ్చి భార్య పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. భార్య తోసేయడంతో మంచం కోడికి తల తగిలి కింద పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసులు తిరిగి పైకి లేచేందుకు ప్రయత్నించాడు. అతను పైకి లేస్తే తనను చంపుతాడని భావించిన భార్య సునీత మంచం కోడికి తల పట్టుకుని కొట్టింది. దీంతో అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు.

హత్యను ఆత్మహత్యగా..

తన భర్త చనిపోయాడని నిర్ధారించుకున్న భార్య సునీత తీవ్ర ఆందోళన చెందింది. దీంతో ఇంట్లో పిల్లలను ఊయల ఊపే తాడుతో మృతదేహానికి ఉరి వేసింది. ఆ తర్వాత ఆమె గట్టిగా కేకలు వేయడంతో బయట ఉన్న వారు వచ్చి చూసే సరికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అందరిని నమ్మించింది. శరీరంపై ఎలాంటి రక్తగాయాలు గానీ దెబ్బలు గానీ పెద్దగా లేకపోవడంతో అందరూ ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావించారు. జూన్ 12న అంత్యక్రియలు పూర్తి చేశారు.

నిందితురాలి అరెస్టు

మొదటి భార్య ఫిర్యాదు మేరకు జులై 2న పోస్టు మార్టం నిర్వహించినప్పటి నుంచి రెండో భార్య సునీత పరారీలో ఉంది. పోలీసులు గాలిస్తున్నట్లు తెలుసుకుని అప్పనపల్లె పంచాయతీ సెక్రటరీ ద్వారా జులై 12న పోలీసుల ఎదుట లొంగిపోయింది. పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రెండవ భార్య సునీతను ఖాజీపేట సీఐ మోహన్ శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో ఉమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ సమాచారం మేరకు ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన ఈర్ల దేవమ్మ(71) రహదారి దాటుతుండగా గుర్తుతెలియని మోటర్‌సైకిల్ ఆమెను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బాలిక అదృశ్యం కేసులో నిందితుడి అరెస్టు

పోక్సో కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్, పోలీసులు

వేంపల్లె : బాలిక అదృశ్యం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన వేంపల్లి పంచాయతీ పక్కీరుపల్లెకు చెందిన బాలిక గొర్రెలను మేపుకునేందుకు అడవిలోకి వెళ్లి అదృశ్యమైన ఘటనపై వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. సీఐ నరసింహులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని తెలిపారు. చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన మడకా బాబు చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండేవాడని, పక్కనే ఉన్న పక్కీరుపల్లెకు చెందిన బాలికతో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడన్నారు. బాలికకు మాయమాటలు చెప్పి తరచూ వీడియో కాల్స్ మాట్లాడేవాడన్నారు. ఈనెల 5వ తేదీన చెన్నై నుంచి మడకా బాబు సొంత గ్రామానికి వచ్చాడన్నారు. 7వ తేదీ ఉదయం బాలిక చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వజ్రాల కోట వద్దకు గొర్రెలను మేపుకునేందుకు వెళ్లిందన్నారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన బాబు బాలికతో మాట్లాడుతున్న సమయంలో గొర్రె పిల్లలు పక్కనే ఉన్న రాఘవరెడ్డి అనే వ్యక్తి పొలంలోకి వెళ్లాయన్నారు. అక్కడ గొర్రె పిల్లలు మాత్రమే ఉండటంతో బాలిక తండ్రికి రాఘవరెడ్డి భార్య ఫోన్ చేసిందన్నారు. అతను అక్కడికి వెళ్లేసరికి కూతురు కనిపించకపోవడంతో మడకా బాబుపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మడకా బాబుతోపాటు అతని స్నేహితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించే సమయంలో పోలీస్ స్టేషన్‌పై బాలిక బంధువులు, గ్రామస్తులు దాడి చేశారని తెలిపారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో బాలిక ఆచూకీ తెలిసిందన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కడప రిమ్స్‌కు తరలించామన్నారు. బాలికను విచారించి మైనర్ కావడంతో మడకా బాబుపై పోక్సో చట్టం కింద అత్యాచారం కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుడిని జమ్మలమడుగు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నరసింహులు, ఎస్ఐ రంగారావు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నెల రోజులుగా చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.లక్ష్మినారాయణ శనివారం మృతి చెందారు. 1990 బ్యాచ్‌కు చెందిన లక్ష్మినారాయణ (హెచ్‌సి 1180) బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ బదిలీల్లో భాగంగా బద్వేలు అర్బన్ స్టేషన్‌కు నియమితులయ్యారు. గత నెల 11వ తేదీన విధుల్లో చేరేందుకు తాను నివాసమున్న కమలాపురం నుండి ఖాజీపేట మీదుగా బద్వేలుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఖాజీపేట సమీపంలోని ఆంజనేయకొట్టాలు వద్ద చెట్టుకొమ్మ విరిగి లక్ష్మినారాయణపై పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కొద్దిరోజుల పాటు కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం ఇటీవలే బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ కూడా కోలుకోలేక శనివారం మృతి చెందారు.

మోపెడ్‌పై నుంచి పడి భర్త మృతి

భార్యకు స్వల్ప గాయాలు



సుబ్బరాయుడు(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లి పంచాయతీ శ్రీరామ్ నగర్ వద్ద శనివారం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న భార్యాభర్తలు ప్రమాదవశాత్తు కింద పడడంతో భర్త సుబ్బరాయుడు (65) మృతి చెందాడు. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రహ్మంగారిమఠంలో సుబ్బారాయుడు కుమారుడు నాగార్జునాచారి వెల్డింగ్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రాత్రి కాశినాయన మండలం ఇటుకలపాడు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, ఆయన భార్య వచ్చారు. శనివారం సాయంత్రం తిరిగి టీవీఎస్ మోపెడ్‌పై వారి గ్రామానికి వెళ్తుండగా టీవీఎస్ మోపెడ్‌కు సుబ్బరాయుడు భార్య చీర చుట్టుకోవడంతో ఒక్కసారిగా ఇద్దరు కింద పడ్డారు. అప్పటికే సుబ్బరాయుడు తలకు పెద్ద గాయం కావడంతో రక్తనాళాలు చిట్లాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తీసుకెళ్తుండగా మృత్యువాతపడ్డాడు. బి.మఠం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు భవితకు బాటలు వేసుకోవాలి

- జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్
- పోలీసు కుటుంబాల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, పోలీసు అధికారులు

కడప అర్బన్ : విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుని కష్టపడితే విజయం మీ సొంతమవుతుందని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సంక్షేమంలో భాగంగా టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 63 మంది పోలీసు, హోమ్ గార్డులు, డీపీఓ సిబ్బంది కుటుంబాల పిల్లలకు నగదు ప్రోత్సాహక మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీసుల పిల్లలు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి మెరిట్ స్కాలర్ షిప్ అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఈ స్ఫూర్తితో మున్ముందు రెట్టింపు కృషితో, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో, వృత్తిలో రాణించేందుకు, ఉన్నత లక్ష్యాలను అధిరోహించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పని సరిగా ఉండాలన్నారు. అప్పుడే వారు లక్ష్యాలను సునాయాసంగా చేరుకోగలరన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా సిబ్బందికి వైద్య పరీక్షలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించడంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్.ఐ. శ్రీశైల రెడ్డి, ఆర్.ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, కార్యవర్గ సభ్యుడు ఏఫ్రిన్, పోలీస్, హోమ్ గార్డు, డీపీఓ సిబ్బంది కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల పోలీసుల అదుపులో టీడీపీ నాయకుడు

మైదుకూరు : మైదుకూరు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడిని శనివారం నంద్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని జీవీ సత్రంలో నివాసం ఉంటున్న ఈ టీడీపీ నాయకుడికి, నంద్యాలకు చెందిన ఓ పోలీసు అధికారి కుమారునికి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు సమాచారం. ఇద్దరూ కలిసి కాంట్రాక్టు పనులు చేయగా డబ్బు విషయమై గతంలో పంచాయితీ కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఆ విషయంలోనే టీడీపీ నాయకుడిని నంద్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జీవీ సత్రానికి సమీపంలోని టీ స్టాల్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు తమ వాహనంలోకి ఎక్కించుకుని అతను ప్రయాణిస్తున్న వాహనాన్ని కూడా వెంట తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. తొలుత కుటుంబ సభ్యులు కిడ్నాప్‌గా భావించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మైదుకూరు ప్రాంతంలో కలకలం రేగింది.

వక్ఫ్‌బోర్డు స్థలంలో భారీ అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని టీచర్స్ కాలనీ వెనుక ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి మూడు ఎకరాల స్థలం ఉండగా అధికార పార్టీకి చెందిన కొంత మంది స్థలాన్ని లీజుకు తీసుకుని ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. కొంత స్థలాన్ని లీజుకు తీసుకోగా మరికొంత స్థలాన్ని అనధికారికంగా వినియోగిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. ఆ స్థలంలో ఉన్న టైర్లతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు అంటుకోవడంతో దట్టమైన పొగలు ఉవ్వెత్తున లేచాయి. అగ్నిమాపక సిబ్బంది నాలుగు వాహనాలను తీసుకొచ్చి సాయంత్రం వరకు మంటలను అదుపు చేశారు. వక్ఫ్‌బోర్డు అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది.

ప్రమాదవశాత్తు మంటలు..

మోటార్ బైకు, ఇతర సామగ్రి దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన మోటారు

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక రాయచోటి బైపాస్ రోడ్డులో ఉన్న ఇంటిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో మోటార్ బైకు, వాకిళ్లు, మోటార్‌తోపాటు ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. శనివారం మధ్యాహ్నం వేంపల్లెలోని రాయచోటి బైపాస్ రోడ్డులో ఉన్న ఇంటిలో నుండి పొగ వ్యాపిస్తుండటంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు ఫైర్ స్టేషన్‌కు సమాచారమందించారు. దీంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చేసరికి ఇంటి ఆవరణంలో ఉన్న మోటార్ బైకు, మరుగుదొడ్లకు చెందిన వాకిళ్లు, కిటికీలు, తాగునీటికి సంబంధించిన మోటార్ పూర్తిగా కాలిపోయాయి. ఈ సందర్భంగా బాధితుడు గోవర్ధన్ మాట్లాడుతూ ఈ అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఫైర్ సిబ్బంది సమయానికి రావడంతో ఇంటి లోపల ఉన్న వడ్ల బస్తాలు అగ్ని ప్రమాదంలో కాలిపోలేదన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా లేక ఇంటి సమీపంలో ఉన్న టైర్లకు ఎవరైనా అగ్గి పెట్టడంవల్ల ఈ ప్రమాదం జరిగిందా అని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

సిద్దవటం : ఎగువపేటలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురికి కాటు వేసింది. ఎగువపేట మఠంవీధిలో శనివారం సాయంత్రం తొమ్మిదేళ్ల బాలుడు ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క వచ్చి కరిచింది. అలాగే పోలీసు లైన్ సమీపంలో ఆరేళ్ల బాలుడిని, మెయిన్ బజారులో తేజ అనే యువకుడిని కూడా కరిచింది.